




పరిమళనగర్ అన్నక్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత



ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం

ఏళ్ల తరబడి ఎదురుచూపులు

- మిడ్తూరు ఎత్తిపోతల పథకం కార్య రూపం దాల్చేనా?
- కేసీ నీటి వాటా వచ్చేనా?
- 20 ఏళ్లుగా అసంపూర్తిగా హంద్రీ నీవా
- నేడు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రాక

నంద్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి)/ నందికొట్కూరు: రాయలసీమ ప్రాజెక్టులపై పాలకుల్లో చిత్తశుద్ధి కనిపించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో అంతులేని నిర్లక్ష్యం సీమ జలాశయాలకు శాపంగా మారింది. కొద్దిపాటి నిధులిస్తే వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు శూన్యం. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం, హంద్రీనీవా విస్తరణ పనులను వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ఆర్భాటంగా ప్రారంభించిన రాయలసీమ దుర్భిక్షం మిషన్ కింద చేపట్టిన కాలువల విస్తరణకు నిధులు ఇవ్వకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. సీఎం చంద్రబాబు సారథ్యంలో మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో కరువు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటిస్తారు. హంద్రీనీవా ప్రాజెక్టు సహా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి నిమ్మల దృష్టి సారించాలని, నిధులు ఇచ్చి కరువు రైతుల 'కన్నీటి' కష్టాలు తీర్చాలని సీమ సాగునీటి నిపుణులు కోరుతున్నారు.

రాయలసీమ ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగు నీరు అందించే లక్ష్యంగా హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం చేపట్టారు. శ్రీశైలం జలాశయం ఎగువన ప్రధాన లిఫ్టు మల్యాల పంప్‌హౌస్ నుంచి 40 టీఎంసీలు ఎత్తిపోయాలి. ఫేజ్-1 కింద నంద్యాల జిల్లా మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 3,850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో 9.5 మీటర్లు బెడ్ విడ్త్ (కాలువ అడుగు భాగం వెడల్పు)తో 216.30 కి.మీలు ప్రధాన కాలువ, కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ (పందికోన), అనంతపురం జిల్లాలో జీడిపల్లి రిజర్వాయర్లు, 8 ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. నేడు 1,940 క్యూసెక్కులు కూడా ఎత్తిపోయలేని పరిస్థితి ఉంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 7.5 టీఎంసీలు వినియోగించుకొని 80 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగా 15-25 వేల ఎకరాలకు కూడా ఇవ్వడం లేదు.

● ప్రశ్నార్థకంగా కేసీ వాటా..?



కర్నూలు టూ కడపకు నీరందించే కేసీ కాలువకు కింద ఉమ్మడి జిల్లాలో దాదాపు 2.65 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. తుంగభద్ర డ్యాం నుంచి కేసీ కాలువకు 15 టీఎంసీల వాటా ఉండగా, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 5 టీఎంసీల నీటిని అనంతపురానికి తరలించాడు. అయితే జగన్ హయాంలో ఆ 10 టీఎంసీల నీటిని కూడా కేసీ కెనాల్‌కు తరలించటంలో నిర్లక్ష్యం వహించాడు. కేసీ కాలువ ఆయకట్టు 2.65 లక్షల ఎకరాలు ఉండగా, గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 3,600 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించినట్లు అధికారి లెక్కలు చెబుతున్నాయి. కేసీ కాలువ ఆయకట్టు కింద ఉన్నా నీరు అందకపోవటంతో నందికొట్కూరు నియోజకవర్గ రైతులు వైసీపీ హయాంలో ఆరుతడి పంటలు సాగు చేసుకోవటం గమనార్హం. కాలువ కింది రైతులు ఆరతడి పంటలు పండించడాన్ని బట్టి చూస్తే గత వైసీపీ ప్రభుత్వ పనితీరు ఏమిటో ఇట్టే అర్థమవుతోంది. ఇక టీడీపీ హయాంలో నిర్మించిన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నియోజవర్గ ప్రజల కష్టాలను కొంతలో కొంత తీర్చగలిగింది. ముచ్చుమర్రి, మాల్యాల ఎత్తిపోతల పథకం విషయంలోనూ వైసీపీ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ పథకాల నిర్వహణకు సంబంధించి నిధులు, కరెంటు బిల్లులు చెల్లించకుండా సతాయించింది. దీంతో నియోజకవర్గంలో మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారా కేసీకి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నా సకాలంలో నీరు విడుదల కాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ అంశాలపై దృష్టి సారించి, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో సక్రమంగా వ్యవహరిస్తే నియోజకవర్గ సాగు నీటి ఇబ్బందులు తొలగుతాయి.

● అటకెక్కిన అలగనూరు..




తుంగభద్ర నుంచి నీరు అందని పరిస్థితుల్లో కుందూలోనికి నీరు వదిలి, ఆ నీటికి కేసీకి మళ్లించేందుకు అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించారు. అయితే నిర్మాణ లోపం వల్ల బండ్ మొత్తం కుంగిపోయింది. వైసీపీ హయాంలో బండ్‌ను ఆధునికీకరించేందుకు అధికారులు 2021లో అధికారులు రూ.3.12 కోట్లతో ప్రతిపాదనలు పంపంచారు. ఆ తర్వాత నిపుణుల కమిటీ పరిశీలించి రిజర్వాయర్ మొత్తం మీద అర కిలోమీటరు మేర బండ్ కుంగిపోయిందని, ఈ మేర మరమ్మతులు చేయాలని సూచించింది. దీంతో అధికారులు మళ్లీ రూ.22 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. పెరిగిన అంచనా వ్యయాలకు అనుగుణంగా ఆ మొత్తం సరిపోదంటూ ప్రతిపాదనలకు సవరణ చేసి రూ.26.33 కోట్ల అంచనా వ్యయంతో అధికారులు ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వానికి మళ్లీ ప్రతిపాదనలు పంపించారు. ఇలా అధికారులు మూడుసార్లు ప్రతిపాదనలు పంపించినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు గానీ, నిధులు కేటాయించిన దాఖలాలు గానీ లేవు. దీంతో రిజర్వాయర్ పూర్తిగా వట్టిపోవటంతో కేసీకి నీరు సరిగా అందకపోవటమే కాకుండా, భూగర్భజలాలు కూడా అడుగంటిపోతున్నాయి. నేడు మాల్యాల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వస్తున్న తరుణంలో ఇక్కడి సాగునీటి ఇబ్బందులను అధిష్టానానికి వివరించి, వాటి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ, జిల్లా రైతాంగం కోరుతోంది.

● మిడ్తూరుకు నెరవేరని కల

నందికొట్కూరు నియోజకవర్గంలో సాగునీటి కాలువలేని ఒకే ఒక్క మండలం మిడ్తూరు. వర్షాధారితంపై ఆధారపటి పంటలు పండిస్తారు. వర్షాలు తక్కువైతే పంటలు ఎండిపోవాల్సిందే. ఈ మండలానికి సాగు నీరు అందించేలా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేస్తే రైతాంగం ఇబ్బందులు తొలగిపోతాయి. మిడ్తూరు మండలంలో ఎత్తిపోతలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని రైతులు కొన్ని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వాలు హామీలు ఇవ్వటం తప్పించి వారి గోడును పట్టించుకున్న వారు లేరు. ఇక యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ సమక్షంలో టీడీపీ నాయకులు తమ పార్టీ అధికారంలోనికి వస్తే మిడ్తూరు ఎత్తి పోతల పథకాన్ని ఏర్పాటు చేయిస్తానని, లేకపోతే తన సొంత డబ్బులతో ఏర్పాటు చేయిస్తానని టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి మిడ్తూరు ప్రజలకు హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు చెప్పిన విధంగా ఎత్తిపోతల ఏర్పాటు చేయిస్తే బాగుంటుందని ఈ మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు గేట్లకు రూ.205 కోట్లు కావాలి

శ్రీశైలం ప్రాజెక్టు ఆనకట్ట స్పిల్‌వే గేట్ల దిగువన ప్లంజ్ పూల్ ప్రాంతంలో 45 మీటర్లు లోతు, 270 మీటర్లు వెడల్పు, 400 మీటర్లు పొడవుతో భారీ గుంత ఏర్పడింది. ప్లంజ్‌పూల్ వల్ల డ్యాం భద్రతకు, ప్రాజెక్టు రెండు వైపుల ఉన్న గట్లు, ఆనకట్ట పునాదిపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరించారు. ప్లంజ్‌పూల్ అధ్యనం కోసం రూ.17 కోట్లు, డ్యాం శాశ్వత మరమ్మతులపై ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు డాక్టరు హ్యానిశ్‌శాలం, అభిషేక్‌కుమార్‌ల సూచనల మేరకు 'డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం' (డ్రిప్)-2 కింద రూ.203 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. తెలుగు రాష్ట్రాలకు జీవనాడి అయినా శ్రీశైలం ప్రాజెక్టు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





● వెలు'గోడు' వినేదెవరు..?:

తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా 16.95 టీఎంసీల సామర్థ్యంతో వెలుగోడు జలాశయం నిర్మించారు. ఆనకట్ట 11.64 కి.మీటర్లు పొడవు, 28 మీటర్లు, ఎత్తు, 6 మీటర్లు పైభాగం వెడల్పుతో నిర్మించిన ఆసియాలోనే అతి పొడవైన మట్టి ఆనకట్ట జలాశయం ఇది. లోపలి భాగంలో వెదర్ రాక్ రివిట్మెంట్ (రాతిపరుపు) బండ్ పొడవున అక్కడక్కడ వెయ్యి మీటర్లకు పైగా రివిట్మెంట్ కుంగిపోయి ప్యాచెస్‌లు ఏర్పడ్డాయని ఇంజనీర్లు గుర్తించారు. గత టీడీపీ ప్రభుత్వంలో డ్యాం రిహ్యాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డ్రిప్)-2 కింద రూ.99 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు రాలేదు. కుంగిన రాతి పరుపు మరమ్మతులు, ఎర్త్‌డ్యాం బండ్ 11.64 కిలోమీటర్లు బలోపేతం, బయటి వైపున మట్టికట్ట కోతకు గురికాకుండా గ్రాస్ పెంపకం, స్పిల్‌వే గేట్ల మరమ్మతులు కోసం రూ.150-155 కోట్లు కావాలని డ్రిప్-3 కింద మరోసారి ప్రతిపాదనలు పంపినట్లు ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

పేదల కోసమే...

● అన్న క్యాంటీన్లను ప్రారంభించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, సెప్టెంబరు 21: ఐదేళ్ల వైసీపీ పాలనలో సామాన్యుడు ఎన్నో కష్టాలు పడ్డాడని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. పేదవాడి ఆకలి తీర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెడితే ఎంతో మానసిక ఆనందం కలుగుతుందన్నారు. కల్లూరు అర్బన్ పరిధిలోని పరిమళనగర్, కల్లూరు ఎస్టేట్‌లో రెండు అన్న క్యాంటీన్లను శనివారం ఎమ్మెల్యే పునఃప్రారంభించారు. ఎమ్మెల్యే గౌరుచరిత పేదలకు అన్నం వడ్డించి, వారితో కలిసి అన్న క్యాంటీన్‌లో భోజనం చేశారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ ఐదు రూపాయలకే పేదల కడుపునింపే బృహత్తర కార్యక్రమానికి ఎన్డీఏ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించడం జరుగుతుందన్నారు. గత వైసీపీ పాలనలో నిర్ధాక్షిణ్యంగా క్యాంటీన్లను మూసేసి పేదల కడుపు మార్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు అన్నాక్యాంటీన్ల ప్రారంభానికి సంతకం చేశారన్నారు. కల్లూరు పరిధిలోని నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలో మరో క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని గౌరుచరిత హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, ఆరోగ్యాధికారి విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ వేణుగోపాల్, ఎంఈ శేషసాయి, డీఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి తగ్గిన ప్రవాహం



శ్రీశైలం, సెప్టెంబర్ 21: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శనివారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగింది. జూరాల నుంచి 10,152 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 877.10 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీ.ఎమ్.సీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 173.4698 టీ.ఎమ్.సీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 13,500 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 15,009 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో క్యాంటెక్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలి: ఎంపీ



కేంద్ర రైల్వే శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 21 : అత్యాధునిక క్యాంటెక్ టెక్నాలజీని నంద్యాల రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేయాలని నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీవైష్ణవ్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతం నుంచి రాష్ట్రంతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సామాన్య రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నంద్యాల రైల్వే స్టేషన్‌లో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ మెయింటెనెన్స్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. రాష్ట్ర విభజనతో మౌలిక సదుపాయాల కల్పన, రాష్ట్ర రాజధానికి, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, దేశంలోని ఇతర ప్రాంతాలకు రాయలసీమ నుంచి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల మధ్య కేంద్రంగా ఉన్న నంద్యాల రైల్వే జంక్షన్ గుంటూరు, గుంతకల్లు, తిరుపతి వంటి ప్రధాన కోచింగ్ డిపోలలో ట్రాఫిక్ భారాన్ని తగ్గించడంలో నంద్యాల రైల్వే స్టేషన్‌కు ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు శబరి తెలిపారు.

మంత్రాలయంలో మరో 200 గదులు


భక్తుల విరాళాలతో నిర్మాణం



మంత్రాలయం, సెప్టెంబరు 21: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పూర్వ పీఠాధిపతి సుయధీంద్రతీర్థుల విశ్రాంతి నిలయంపైన మరో (200 గదుల సముదాయం నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషీ తెలిపారు. శనివారం వారు విలేఖరులతో మాట్లాడుతూ మరో 200 గదుల నిర్మాణానికిగాను ఇప్పటికి ఒక్కో గదికి రూ.7 లక్షల ప్రకారం 113 గదులకు రూ.5.50 కోట్లు దాతలు ఇచ్చారని తెలిపారు.

సంక్షోభంలోనూ సంక్షేమం

ఆ ఘనత కూటమి ప్రభుత్వానిదే: మంత్రి ఫరూక్



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

గోస్పాడు, సెప్టెంబరు 21 : ఆర్థిక సంక్షోభంలో కూడా సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర న్యాయ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో సభలు ఏర్పాటు చేసి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వివరించడంతోపాటు సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అవ్వా తాతల పెన్షన్ రూ.4000 చేయడంతో పాటు మూడు నెలలతో కలిపి రూ.7000 అందించిన ఘనత కూటమిదేనని అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం నాణ్యతకు తిలోదకాలిస్తూ జగన్ ప్రభుత్వం తప్పు చేసిందని అన్నారు. ఆడ బిడ్డల కోసం దీపావళి నుంచి మూడు ఉచిత సిలిండర్లను అందించబోతున్నామని తెలిపారు. అనంతరం కస్తూరిబా విద్యార్థులకు పుస్తకాలు మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఎంపీడీవో నాగ అనసూయ, తహసీల్దార్ షేక్ మోహిద్దీన్, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, సర్పంచ్‌లు సుధామణి, ప్రమీళ, టీడీపీ నాయకులు వీరసింహారెడ్డి, శీలం భాస్కర్‌రెడ్డి, జిన్నం శ్రీనివాసరెడ్డి, రాకేష్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, భూమా హుసేని, బాలన్న, పెద్దహుసేని, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.20లక్షలు విరాళం



మంత్రి ఫరూక్‌కు చెక్కును అందజేస్తున్న విజయ డెయిరీ చైర్మన్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 21: విజయవాడ వరద బాధితుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు నంద్యాలలోని విజయా పాల డెయిరీ తరపున రూ.20 లక్షల చెక్కును మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు శనివారం నంద్యాలలో అందజేశారు. విజయా పాల డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్‌రెడ్డి, బోర్డు డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, రఘుస్వామిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, ఇతర డైరెక్టర్లు ఫరూక్‌ను కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఫరూక్ వారిని అభినందించారు. అలాగే అయ్యలూరు గ్రామానికి చెందిన సాయివాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ హుసేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.25వేల చెక్కును శనివారం మంత్రి ఫరూక్‌కు అందజేశారు.

రైతు ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

మద్దికెర, సెప్టెంబరు 21: పంటలు చేతికందక.. అప్పులకు వడ్డీలు కట్టలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మద్దికెర మండలంలో శనివారం చోటు చేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన రమేష్ నాయుడు, ప్రభావతమ్మ దంపతుల కుమారుడు సురేష్ (35) తమకున్న వ్యవసాయ పొలంతో పాటు మరో 22 ఎకరాల తోటను కౌలుకు తీసుకుని ఎక్కువ శాతం మిరప పంటను చేశాడు. గత మూడేళ్ల నుంచి ఆశాజనకంగా పంటలు లేకపోవడం, ధరలు లేకపోవడంతో దాదాపు రూ.20 లక్షల మేర అప్పులు చేశాడు. ఈ ఏడాది కూడా మిరప పంట సాగు చేసినప్పటికీ ధరలు లేకపోవడంతో మనోవేదనకు గురై శనివారం ఉదయం విషగుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం జిల్లా గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రైతు సురేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్దికెర ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ నాయకులు బురుజుల శ్రీనివాస్ నాయుడు, ఎర్రిస్వామి, ప్రదీప్, యుగంధర్ కోరారు.

నేడు సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల కౌన్సెలింగ్

● డీఐజీ కార్యాలయంలో హాజరుకానున్న నాలుగు జిల్లాల సబ్ రిజిస్ట్రార్లు

కల్లూరు, సెప్టెంబరు 21: సాధారణ బదిలీల్లో భాగంగా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు శనివారం డిఐజీ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆదివారం కర్నూలు జిల్లా కేంద్రంలోని వెంకటరమణ కాలనీ రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈమేరకు ఉమ్మడి రాయలసీమ నాలుగు జిల్లాల డీఐజీలు హాజరుకానున్నట్లు కార్యాలయ అధికారులు వివరించారు. ముందుగా జిల్లాల వారిగా సబ్ రిజిస్ట్రార్‌లకు, మధ్యాహ్నం సీనియర్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. సబ్ రిజిస్ట్రార్లను కేటగిరీల వారిగా (ఏ, బి, సి) బదిలీలు జరుపనున్నారు. రూ.50 కోట్లకు పైబడి ఆదాయం ఉన్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను ఏ-కేటగిరి, రూ.50 కోట్లకు తక్కువ ఆదాయం ఉంటే బి-కేటగిరి, రూ.15 కోట్ల కంటే తక్కువ ఆదాయం ఉంటే సి-కేటగిరిగా పరిగణించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 24 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు ఉండగా ఏ-కేటగిరిలో-5, బీ-కెటగిరీలో- 5, సీ-కేటగిరిలో-14 రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. బదిలీల ప్రక్రియలో రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆదేశాలకు లోబడి బదిలీలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

సబ్ జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్ది

నందికొట్కూరు, సెప్టెంబరు 21: నందికొట్కూరు పట్టణంలోని ఉప కారాగారాన్ని కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్ది, డీఎల్ఎస్ఏ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కబర్ది మాట్లాడుతూ ఖైదీల ఆరోగ్యం, క్షేమాలు, భోజన వసతి సౌకర్యాలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలపై ఖైదీలకు ఆయన వివరించారు. ఈయన వెంట నందికొట్కూరు సీనియర్ న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని, జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అరుణ్ కుమార్, సబ్ జైల్ సూపరింటెండెంట్ మల్లయ్య ఉన్నారు.

23 వరకే ఈక్రాప్, ఈకేవైసీ నమోదు

వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 21: ఈక్రాప్, ఈకేవైసీ నమోదుకు ఈ నెల 23వ వరకే అవకాశం ఉందని, త్వరపడి రైతులు ఆ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసి అప్‌లోడు చేస్తారని అన్నారు. ఇప్పటి దాకా 70 శాతం పంటలకు ఈక్రాప్, ఈకేవైసీ నమోదైందని తెలిపారు. ఇంకా 33 శాతం ప్రక్రియ అసంపూర్తిగా ఉందని తెలిపారు. వాస్తవానికి ఈ నెల 15తోనే ఈక్రాప్ నమోదు పూర్తి కావాల్సి ఉన్నా.. వివిధ కారణాల వల్ల ఈక్రాప్, ఈకేవైసీ నమోదులో ఆలస్యం జరిగిందన్నారు. అందువల్ల ప్రభుత్వం ఈ నెల 23వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని కోరారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు, సెప్టెంబరు 21: నగర శివారులో గుత్తి పెట్రోలు బంకు వద్ద కృష్ణకుమార్ (51) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద లభించిన ఆధారాలతో బంధువులకు సమాచారం ఇచ్చారు. స్థానిక అరోరా నగర్‌కు చెందిన కృష్ణకుమార్ గతంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొద్ది రోజులుగా ఆయన మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. శుక్రవారం రాత్రి కూడా తాగి ఇంటికి వెళ్లగా.. ఇంట్లో వాగ్వాదం జరిగింది. దీంతో బైటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం శవమై కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి బంధువులకు అప్పగించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోవెలకుంట్లలో వృద్ధుడు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 21 : కోవెలకుంట్ల మండల పరిధిలోని సౌదరిదిన్నె గ్రామ సమీపంలో రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కడప జిల్లా జమ్మలమడుగు మండలం మోరగుడికి చెందిన దండె సూర్యనారాయణ (60) సౌదరదిన్నెలో బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం గ్రామానికి వెళ్తూ తెల్లవారుజామున రైలు కింద పడి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

అవుకు, సెప్టెంబరు 21 : అవుకు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన తలారి ప్రశాంత్ (21) అనే యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ప్రశాంత్ మద్యానికి బానిసై అప్పులు చేస్తుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్థాపానికి చెందిన ప్రశాంత్ ఈ నెల 11వ తేదీన అవుకు సమీపంలోని ఎస్సార్బీసీ కాల్వ వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి గంగులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

సహస్ర హాస్పిటల్‌లో రోగి మృతి

మృతదేహంతో ధర్నా చేసిన బంధువులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 21: సహస్ర హాస్పిటల్‌లో రోగి మృతి చెందడంతో బంధువులు ధర్నాకు దిగారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం పందికుంటకు చెందిన 38 ఏళ్ల అనిల్ పేగు మడత పడిందంటూ గాయత్రి ఎస్టేట్‌లోని సహస్ర ఆసుపత్రిలో చేరాడు. అడ్మిషన్ చేసుకున్న వైద్యులు ఆపరేషన్ తర్వాత రోగి మృతి చెందాడు. దీంతో బంధువులు మృతదేహంతో ఆందోళన చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. త్రీటౌన్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు బంధువులకు మధ్య వాగ్వివాదం జరిగింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఎన్టీఆర్ వైద్య సేవ ఉన్నా హాస్పిటల్‌లో డబ్బులు వసూలు చేస్తున్నారని బంధువులు ఆరోపించారు.

జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు బదిలీలు

ఉత్తర్వులు ఇచ్చిన ఎస్ఈ ఎం.ఉమాపతి

కల్లూరు, సెప్టెంబరు 21: విద్యుత్ శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు బదిలీలు ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులు డివిజన్ నుంచి మరో డివిజన్‌కు బదిలీ చేయాలని అభ్యర్థించిన నేపథ్యంలో ఎస్ఈ ముగ్గురు జేఎల్ఎంలకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు.

ఆత్మస్థైర్యమే అండ



- ● క్యాన్సర్ రోగికి చికిత్స కంటే సాంత్వన ముఖ్యం
- ● రోగులకు ప్రత్యేక కౌన్సిలర్లు అవసరమంటున్న నిపుణులు
- ● నేడు వరల్డ్ రోజ్ డే

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 21: శరీరాన్ని రోగం పీడిస్తుంటే.. మనస్సు ఒత్తిడికి గురవుతుంది. మనోల్లాసం కరువై రోగి జీవితం వ్యథగా మారుతుంది. రోగం వల్ల ఏడాదిలోనే చనిపోతారనుకొనే వ్యక్తి మానసిక ఒత్తిడి వల్ల ఆరు నెలల్లోనే కాలం చేసే ప్రమాదం ఉంది. అందుకే భాదితులకు సాంత్వన అవసరమని వైద్యులు చెబుతారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి బారిన పడ్డామని తెలిసిన మరుక్షణమే అధైర్యానికి గురవుతారు. అందుకే రోగికి చికిత్స కంటే స్వాంతన ముఖ్యం. క్యాన్సర్ రోగులకు ఇది అత్యవసరం. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం సెప్టెంబరు 22న ప్రపంచో ఆరోగ్య గులాబీ దినోత్సవం (వరల్డ్ రోజ్ డే) నిర్వహిస్తున్నది.



కెనడా దేశానికి చెందిన మెలిండా రోజ్ అనే అమ్మాయి గౌరవార్థం క్యాన్సర్ రోగుల కోసం ప్రపంచ గులాబి దినోత్సవం జరుపుకుంటారు. మెలిండా రోజ్ 12 సంవత్సరాల వయస్సులో అరుదైన బ్లడ్ క్యాన్సర్ అస్కిన్స్ ట్యూమర్‌తో బారిన పడింది. ఆ వ్యాధి నిలువెల్లా తీనేసింది. ఈ క్రమంలో ఆమె కొన్ని వారాలు మాత్రమే బ్రతుకుతుందని డాక్టర్లు చెప్పారు. కానీ మనోధైర్యం ఉంటే ఆయుష్షను కూడా పెంచుకోవచ్చని ఆ చిన్నారి నిరూపించింది. కొన్ని వారాలు మాత్రమే జీవిస్తుందన్న ఆమె ఆరు సంవత్సరాలు జీవించింది.

● క్యాన్సర్ అంటే ఏమిటి ..?

మానవ శరీర నిర్మాణం కణ విభజనపై ఆధారపడి ఉంటుంది. శరీరంలోని అన్ని అవయవాల్లోను నిరంతరం కణవిభజన నియమిత ప్రక్రియలో జరుగుతుంది. శరీర అవసరాలకు అనుగుణంగా కణవిభజన జరగడం ఆరోగ్యం. కానీ ఎక్కువ తక్కువగా జరిగితే ప్రమాదకరం. ఇలా జరిగినప్పుడు శరీరం తనపై కణాలు చనిపోయి క్యాన్సర్ కణాలు అభివృద్ధి చెందుతాయి. దీన్ని క్యాన్సర్ అంటారు. శరీరంలోని ఏదో ఒక ప్రాంతంలో ఇది ప్రారంభమై చివరికి శరీరమంతాటా విస్తరిస్తుంది. కణ విభజన జరగని గోళ్లు, వెంట్రుకలు, కంటిపైన ఉండే కార్నియాలకు జీవం ఉండదు. కాబట్టి వాటికి సోకదు. మిగిలిన ఏ ప్రాంతానికైనా క్యాన్సర్ సోకవచ్చు. క్యాన్సర్లలో అత్యాధునికంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులే ఎక్కువ. వీటి తర్వాత నోరు, బ్రెస్ట్, లివర్, పెద్దప్రేగు, పొట్ట, అన్నవాహిక, క్యాన్సర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఆత్మస్థైర్యాన్ని పెంచాలి



క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచాలి. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇందుకోసమే సెప్టెంబరు 22 వరల్డ్ రోజ్ డే నిర్వహిస్తున్నారు. ప్రజల్లో కూడా రోగుల పట్ల అపోహలు ఉన్నాయి. రేడియేషన్ వల్ల ప్రమాదమని భావిస్తారు. ఇటువంటి అపోహలను వదలుకోవాలి. వ్యాధి గురించి ఎక్కువ ఆలోచించడం ఆందోళన వల్ల రోగులు త్వరగా చనిపోతారు. రోగులు ఏ స్థాయిలో ఉన్నా ఎదుర్కొంటున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉంటే క్యాన్సర్‌నైనా జయించి బతకవచ్చు. ఇందుకు మిలిందారోజ్ ఉదాహరణగా చెప్పవచ్చు.

- డాక్టర్ సి.వాసురెడ్డి, సీనియర్ సర్జికల్ అంకాలజిస్టు, వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, కర్నూలు

రోగులకు భరోసా అవసరం



క్యాన్సర్ రోగులకు సాంత్వన కల్పించడం ప్రధాన అంశం. రోగులకు మానసిక స్థైర్యాన్ని కల్పిస్తే వ్యాధి నయమయ్యేందుకు దోహదపడుతుంది. మన దేశంలో వైద్యులే రోగులకు కౌన్సిలింగ్ చేస్తారు. చికిత్సకు వచ్చే సమయంలోనే కొంత సేపు రోగితో మాట్లాడి వ్యాధి గురించి అవగాహన కల్పిస్తున్నాం. ధైర్యమే మనిషిని మరింత కాలం బతికేలా చేస్తుంది.

- డాక్టర్ వై.వెంకట్రామిరెడ్డి, రేడియేషన్ అంకాలజిస్టు, ఓమెగా హాస్పిటల్, కర్నూలు

● క్యాన్సర్‌పై అవగాహన పెరగాలి



క్యాన్సర్ ఎందుకు వస్తుందన్న విషయంపై చాలా మందికి అవగాహన లేదు. ఈ వ్యాధిపై అవగాహన పెరగాలి. శరీరంలోని ఏ అవయవానికైనా క్యాన్సర్ రావచ్చు. అమీలియో హాస్పిటల్‌లో 50 పడకలతో క్యాన్సర్ వ్యాధికి అందుబాటులో వైద్యం ఉంది. ప్రపంచంలో అత్యుత్తమ నాణ్యమైన రేడియోథెరపీ ఉంది. దీంతో పాటు సర్జికల్, మెడికల్ అంకాలజీ వైద్యులు, రేడియేషన్ అంకాలజీ వైద్యులు పూర్తి స్థాయిలో ఉన్నారు.

- డాక్టర్ బి. రేవతి, మెడికల్ అంకాలజిస్టు అమీలియో హాస్పిటల్, కర్నూలు

సీమ ఉద్యమకారుడు కామిని వేణుగోపాల్‌రెడ్డి మృతి

నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి



వేణుగోపాల్ రెడ్డి (ఫైల్)

కోవెలకుంట్ల, సెప్టెంబరు 21 : రాయలసీమ ఉద్యమకారుడు, కుందూ పోరాట సమితి వ్యవస్థాపకుడు కామిని వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం కోవెలకుంట్లలోని స్వగృహంలో పలువురు రాయలసీమ ఉద్యమకారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆయన భౌతిక కాయానికి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి.. వేణుగోపాల్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువునేల రాయలసీమ సమస్యలు 80 శాతం నీటి వల్లనే తొలగుతాయని నమ్మిన వ్యక్తి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. రాయలసీమకు నీరు సాధించేందుకు ఆయన రాజీ లేని పోరాటం చేస్తున్నాడన్నారు. సిద్ధేశ్వరం వద్ద క్రిష్ణానదిపై తీగల వంతెన బదులు బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణం చేయాలని ఒక వైపు ఉద్యమం చేస్తూ మరో వైపు సుప్రీంకోర్టు తలుపులు తట్టిన ఉద్యమకారుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ అంతిమ యాత్రలో కర్నూలు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, బీవీ ప్రసాద్‌రెడ్డి, రాయలసీమ ఉద్యమ నేతలు అనంతపురం జిల్లా రామ్‌కుమార్, తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి,



కామిని వేణుగోపాల్‌రెడ్డి పార్థీవ దేహానికి పూలమాలలు వేస్తున్న రాయలసీమ ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి

అశోక్‌వర్ధన్‌రెడ్డి, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ రామాంజనేయులు, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరధరామిరెడ్డి, ఏర్వ రామచంద్రారెడ్డి, జ్యోతిర్మయి, హనుమంతరెడ్డి, కోవెలకుంట్ల ప్రజాసంఘాల నాయకులు కరీంబాషా, రచయిత కాశిపురం ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

దొంగ అరెస్ట్

రూ.1.50 లక్షల నగదు స్వాధీనం

నంద్యాల క్రైం, సెప్టెంబరు 21 : నంద్యాలలోని నూనెపల్లె సమీపంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఈ నెల 2వ తేదీ జరిగిన చోరీ కేసును త్రీ టౌన్ పోలీసులు ఛేదించారు. షేక్ ఇంతియాజ్ వద్ద ఉన్న రూ.2.60 లక్షల నగదును గుంటూరు జిల్లా స్టూవర్టుపురం గ్రామానికి చెందిన మానుపాటి దుర్గా ప్రసాద్ దొంగలించాడని త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి శనివారం తెలిపారు. దుర్గాప్రసాద్‌ను నూనెపల్లె ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద అరెస్ట్ చేశామని, గతంలో విశాఖపట్టణంలో దొంగలించిన స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగ వద్ద వున్న రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దుర్గాప్రసాద్‌కు సహకరించిన నెల్లూరు జిల్లా బిట్రగుంట గ్రామానికి చెందిన దొడ్డ జాన్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ వెల్లడించారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

ఆత్మకూరు, సెప్టెంబరు 21: ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో లారీ కింద పడి ముర్తుజాబి(65) అనే వృద్ధురాలు మృతి చెందింది. ఆత్మకూరు పట్టణానికి చెందిన ఓ లారీ నంద్యాల టర్నింగ్ సప్లయిర్స్ దుకాణం వద్ద సామాన్లు దింపి అక్కడి నుంచి కదులుతోంది. అక్కడ పట్టణంలోని మోమిన్ నగర్‌కు చెందిన ముర్తుజాబీ అనే వృద్ధురాలు ఉండటంతో లారీ ఆమెను తగిలింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలి కాలిపై లారీ టైరు ఎక్కడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో అక్కడున్న వారు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జలవనరుల శాఖ మంత్రి రాక

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 21 : ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామనాయుడు ఆదివారం నందికొట్కూరు మండలం రానున్నారు. నందికొట్కూరు మండలం మల్యాల గ్రామం వద్ద గల హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శిస్తారు. ప్రాజెక్టుల నిర్వహణ, పని తీరుపై సమీక్షించనున్నారు. రైలు మార్గంలో ఉదయం డోన్ చేరుకొని అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ అతిథి గృహానికి వెళ్తారు. నీటి పారుదల శాఖా అధికారులతో సమీక్ష నిర్వహించి అనంతరం మల్యాల వద్ద గల హంద్రీనీవా ప్రాజెక్టును పరిశీలిస్తారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

● మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్ పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21: కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లా అభివృద్ధికి వినియోగించుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అధ్యక్షతన దిశా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల శాఖలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మాదిరిగానే జిల్లాలో అన్ని శాఖల్లో అభివృద్ధి పనులు వేగంగా జరగాలని అన్నారు. అధికారులు జవాబుదారితనంతో, సమన్వయంతో పని చేయాలని కోరారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె గృహాల్లో ఉండడం వల్ల పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని ఎంపీ స్త్రీ, శిశు సంక్షేమ అధికారిని ఆదేశించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ఈ-పంట నమోదు సక్రమంగా జరగడం లేదని అన్నారు. పంటను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ఆలూరులో ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు ఐదు ఎకరాలు ఇస్తామని ఓ వ్యక్తి ముందుకు వచ్చారని అన్నారు. అందుకు సంబంధించి వెరిఫై చేయాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. పాఠశాల భవనాల స్థితిగతులను వెరిఫై చేసేందుకు పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ అధికారులను వినియోగించుకోవాలని సూచించారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, కేజీబీవీ పాఠశాలలో సీట్లు పెంచే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌ఫెర్టిలిటీ సేవలు అందుబాటులో ఉండాలి

రాష్ట్ర ఇన్‌ఫెర్టిలిటీ వైద్యుల సదస్సులో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 21: సంతానలేమి ఇన్‌ఫెర్టిలిటీ వైద్యసేవలు పేదలకు తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తీసుకరావాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వైద్యులను కోరారు. శనివారం కర్నూలు మౌర్యఇన్ హోటల్‌లో రెండు రోజుల ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెంట్ రీప్రొడెక్షన్ (ఐఎస్ఏఆర్) రాష్ట్ర ఇన్‌ఫెర్టిలిటీ వైద్యుల సదస్సును పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీకి మాతృత్వం వరమని, ఇన్‌ఫెర్టిలిటీ వైద్యం పేదలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఐఎస్ఏఆర్ జాతీయ కార్యదర్శి డా. ఆశాబక్షి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇన్‌ఫెర్టిలిటీ వైద్యులు 6వేల మంది ఉన్నారని, ఏపీలో 2017 ఈ సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం కర్నూలులో ఇన్‌ఫెర్టిలిటీ వైద్యాన్ని పరిచయం చేసిన సీనియర్ గైనకాలజిస్టులు డా.బీటీ సీత, డా.తిరుపాల్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డా.విష్ణుప్రియ, కార్యదర్శి డా.డి.విజయలక్ష్మి, ఐఎస్ఏఆర్ రాష్ట్ర అధ్యక్షురాలు డా.పద్మలత, ఎగ్జిక్యూటీ కమిటి సభ్యులు డా.శ్రావ్య, డా.శిరీషారెడ్డి, 300 మంది వివిధ రాష్ట్రాల నుంచి ఇన్‌ఫెర్టిలిటీ, గైనిక్ వైద్యులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 21 : కోవెలకుంట్ల పట్టణంలో చోరీ చేసిన దొంగను అరెస్టు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కోవెలకుంట్లలోని ముదిగేడు రోడ్డులో రైల్వే బ్రిడ్జి వద్ద శివకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న కిరాణం షాపులో దొంగతనం చేసి రూ.35 వేలు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అతని నుంచి రూ.34 వేలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. శివకుమార్ తమిళనాడులోని వివిధ పోలీసుస్టేషన్‌లలో షట్టర్ బ్రేకింగ్ కేసుల్లో ఉన్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. రేణిగుంటలో కూడా కేసు ఉన్నట్లు వెల్లడించారు.

రెవెన్యూ శాఖలో బదిలీలు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21: రెవెన్యూ శాఖలో పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు శనివారం బదిలీ అయ్యారు. కర్నూలు అర్బన్ తహసీల్దార్‌గా పని చేస్తున్న రామానుజనమ్మను దేవనకొండకు, పత్తికొండ తహసీల్దార్‌గా ఉన్న వెంకటలక్ష్మిని కర్నూలు అర్బన్ తహసీల్దార్‌గా, పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పని చేస్తున్న సతీష్‌ను హొళగుంద తహసీల్దార్‌గా నియమించారు. అంతకముందు హొళగుంద తహసీల్దార్‌గా పని చేస్తున్న ప్రసాద్ రాజును పత్తికొండ ఆర్డీవో కార్యాలయం డీఏవోగా మార్చారు. సీసీఎల్ఏలో పని చేస్తున్న శ్రీనివాసరెడ్డిని సి.బెళగల్ తహసీల్దార్‌గా, ఇక్కడ పని చేసిన విజయశ్రీని కలెక్టరేట్ ఏవోగా నియమించారు. నంద్యాల జిల్లా నుంచి ఓర్వకల్లు తహసీల్దార్‌గా విద్యాసాగర్ నియమితులయ్యారు. కలెక్టరేట్ ఏవోగా పని చేస్తున్న రాజేశ్వరిని డీఆర్వో సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా, అంతకముందు ఈ స్థానంలో యోగేశ్వరిదేవిని తుగ్గలి తహసీల్దార్‌గా నియమించారు. వీరితోపాటు 42 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 12 మంది జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు బదిలీ అయ్యారు. నంద్యాల నుంచి కర్నూలుకు 15 మంది, కర్నూలు నుంచి నంద్యాలకు 13 మందికి స్థాన చలనం జరిగింది.

గ్రామ పంచాయతీలకు వాటర్ ప్లాంట్ల అప్పగింత



మినరల్ వాటర్ ప్లాంట్‌ను పంచాయతీ కార్యదర్శులకు అప్పగిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

పగిడ్యాల, సెప్టెంబరు 21: మండలంలోని తూర్పు, పడమర నెహ్రూనగర్ గ్రామాల్లోని మినరల్ వాటర్ ప్లాంట్‌లను శనివారం గ్రామ పంచాయతీ అధికారులకు అప్పగించారు. 'మరమ్మతులకు నోచుకోని వాటర్ ప్లాంట్లు' అన్న శీర్షికతో ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ స్పందించారు. ప్లాంట్‌లలోని సామగ్రిని తనిఖీ చేసిన అనంతరం పంచాయతీ కార్యదర్శులు వీరన్నయాదవ్, మల్లికార్జునకు ప్లాంట్ల పత్రాలను అందజేశారు. త్వరలోనే ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టి నీటిని సరఫరా చేస్తామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో దాసు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 21: ప్రభుత్వ భూములకు డీపట్టాలు ఇచ్చిన రైతులకు 20ఏళ్ల పైబడిన పొలాలను రిజిస్టర్ చేస్తామన్న ప్రభుత్వ నిబంధన మేరకు రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో దాసు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. రీసర్వే చేస్తున్న రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో 2,355 ఖాతాలకు గాను 4468.1 ఎకరాలు ఉన్నాయని, మొత్తం 1600 మంది రైతులు ఉన్నారని చెప్పారు. సర్వే చేస్తున్న సమయంలో ప్రభుత్వ నిబంధనల మేరకే చేయాలని అవకతవలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్లు నాగన్న, చంద్రశేఖర్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బండిఆత్మకూరు, సెప్టెంబరు 21: మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో లలితమ్మ కుటుంబ సభ్యులకు స్థానిక టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. శనివారం తెల్లవారుజామున ఎస్సీ కాలనీకి చెందిన లలితమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మధుసూదన్‌రెడ్డి లలితమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. టీడీపీ ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందని ఆయన అన్నారు.

'పెండింగ్ కేసులను విచారించాలి'

పాములపాడు, సెప్టెంబరు 21: గత వైసీపీ పాలనలో, నేటి టీడీపీ ప్రభుత్వంలో పెండింగులో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులను విచారించి సత్వరమే బాధితులకు న్యాయం చేయాలని జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి అంకన్న డిమాండ్ చేశారు శనివారం పాములపాడులో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా ఎస్సీ, ఎస్టీలపై కుల వివక్షతో దాడులు జరిగాయని, బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయడంలో అలసత్వం వహిస్తున్నాయని అన్నారు. దీంతో బాధిత కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడ్డ నిందితులకు శిక్షలు పడలేదని, బాధితులకు సాయం అందలేదని అన్నారు. కులవివక్ష, పేదరికం కారణంగా దేశ వ్యాప్తంగా మన రాష్ట్రంలో పాటు అనేక రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వాలు రక్షణ కల్పించడంలో విఫలమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహానందిలో ఏపీజీబీ జీఎం పూజలు

మహానంది, సెప్టెంబరు 21: మహానంది క్షేత్రంలో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ హర్కేశ్వర్ ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం జీఎం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు అభిషేకార్చన పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. కల్యాణ మంటపంలో వీరిని ఆలయ వేదపండితులు హనుమంత్ శర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, మహానంది బ్రాంచ్ మేనేజర్ హరీష్ పాల్గొన్నారు.

'మెడికల్ సీట్లు సాధించడం అభినందనీయం'

ఆత్మకూరు, సెప్టెంబరు 21: ఆత్మకూరు పట్టణంలోని జి.పుల్లారెడ్డి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన ముగ్గురు పూర్వ విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించడం అభినందనీయమని పాఠశాల డైరెక్టర్ గోపిశెట్టి సాయిప్రణీత్ అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు హారికబాయి, శరణ్య, నూర్ అహ్మద్‌లు నీట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మెడికల్ సీట్లు సాధించడంతో శనివారం వారిని పాఠశాల తరుపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం చాంద్‌బాషా తదితరులు ఉన్నారు.

'పంట నమోదు తప్పనిసరి'

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 21: ఉద్యావన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో తమ ఉద్యావన పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి చందన రైతులకు సూచించారు. శనివారం నల్లకాలువ గ్రామంలో ఈ పంట, ఈకేవైసీ నమోదును పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యావన పంటలకు గాను రైతులకు వివిధ రకాల రాయితీలు ప్రభుత్వం కల్పిస్తోందని, వాటి కోసం సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఉద్యావన అధికారులను సంప్రదించాలని కోరారు. డ్రైవాన్ స్ప్రేయర్లు రాయితీలో అందుబాటులో ఉన్నాయని, రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని వాటిని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యావన వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి



నివాళి అర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 21: నంద్యాల శాఖ గ్రంథాలయంలో శనివారం గురజాడ వెంకట అప్పారావు 162 జయంతిని సాహితీ స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుజాడ కన్యాశుల్కం నాటకం, సాహిత్యానికి ఎనలేని కృషిచేసిన వ్యక్తి గురజాడ అని వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనందరావు వివరించారు. గురుజాడ తెలుగు సాహిత్యానికి అడుగుజాడ గురుజాడ అని సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి కార్యదర్శి వెంకటేశ్వర్లు, సభ్యులు శేషఫణి, ప్రసాద్, రమేష్, మహబుబ్‌బాషా, శ్రీధర్, రఫి, సుబ్బయ్య, నబిరసూల్, తెలుగు కవులు తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- 'ఇది మంచి ప్రభుత్వం'లో ప్రజాప్రతినిధులు, అధికారులు



వెలుగోడు: బోయరేవులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా



పాములపాడు: వేంపెంట గ్రామంలో..



తలముడిపిలో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య



ఆత్మకూరులో..



నందికొట్కూరులో..

వెలుగోడు, సెప్టెంబరు 21: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బోయరేవుల గ్రామంలో సర్పంచ్ పెద్ద సామన్న అధ్యక్షతన శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మేనిఫెస్టోలో తెలిపిన విధంగా పింఛన్ రూ.4 వేలకు పెంపు, మెగా డీఎస్సీ, గ్రామీణాభివృద్ధికి పంచాయతీకి నిధులు, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.5 భోజనం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని తెలిపారు. గత వైసీపీ పాలనలో వ్యవస్థలను సర్వనాశనం చేశారని మండి పడ్డారు. కమీషన్లకు కక్కుర్తిపడి కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారని అన్నారు. శ్రీవారి సొమ్మును దోచేయడంతో పాటు కోట్లాది హిందువుల మనోభావాలు వైసీపీ నాయకులు దెబ్బతీశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అమానుల్లా, టీడీపీ నాయకులు శేషిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, రాజశేఖర్, సుంకిరెడ్డి, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని 4వ వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బేబీ నిర్వహించారు. పలు రకాల పథకాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు.

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, సీనియర్ నాయకులు గోవిందరెడ్డి, కలీముల్లా, బాషా, రామకృష్ణ, రామసుబ్బయ్య, రామ్మూర్తి, బీజేపీ నాయకులు సుదర్శన్, సాంబశివ, జనసేన నాయకుడు అరుణ్ పాల్గొన్నారు.

మిడుతూరు: అలగనూరు రిజర్వాయర్ నుంచి సొంత జిల్లా అయిన కడప జిల్లాకు నీళ్లు తీసుకుపోలేని అసమర్థుడు మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య విమర్శించారు. తలముడిపి గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభ్వుతం' కార్యక్రమానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుంగిన అలగనూరు రిజర్వాయర్ కట్టను అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ.3 కోట్లతో ఖర్చు చేస్తే పని పూర్తయ్యే పనిని ప్రస్తుతం రూ.34 కోట్ల ఖర్చు చేయాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం వంద రోజుల పరిపాల గురించి ప్రజలకు వివరించారు. తలముడిపి గ్రామంలో కుందూ నది బ్రిడ్జి, నందికొట్కూరు నుంచి గడివేముల వరకు రెండు లైన్ల రోడ్డు నిర్మిస్తామని ఆయన తెలిపారు. అనంతరం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను ఇంటి ఇంటికి తిరిగి అందజేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు శివరామిరెడ్డి, రామస్వామి రెడ్డి, మనోహర్‌రెడ్డి, రవీంద్ర బాబు, నరసింహగౌడు, సర్వోత్తమ రెడ్డి, ఇద్రూస్, బీజేపీ నాయకుడు దామోదర్ రెడ్డి, జనసేన నాయకులు రవికుమార్, సంపత్, అధికారులు పాల్గొన్నారు.

పాములపాడు: వేంపెంట గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, బాలస్వామి, మాణిక్యమ్మ, మోహన్‌గౌడ్, రమణారెడ్డి, రమేశ్, రాజేశ్, అంజిరెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, రామ్మోహనరెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: ఎ.కోడూరు, బండిఆత్మకూరు, శింగవరం గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలు, స్టిక్కర్లు ఇంటింటికి అందజేశారు. కార్యక్రమాల్లో ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి, ఈవోపీఆర్డీ నటరాజ్, శ్రీనివాసరెడ్డి, జాకీర్, మధురెడ్డి, శివ కుమార్, మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జయరామిరెడ్డి, సర్పంచ్ సంధ్య, కొత్తూరయ్య, నందయ్య పాల్గొన్నారు.

మహానంది: బుక్కాపురం, అబ్బీపురం గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు బోచర్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఉల్లి మధు, యూనిట్ ఇన్‌చార్జిలు జనార్దన్‌రెడ్డి, ఎంఈవో రామసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి సుమంత్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు శివ, నాగపుల్లయ్య, సుబ్రమణ్యం, నాగరాజు, జయరాం, మాజీ ఎంపీటీసీ దస్తగిరి, హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడాలి

- శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ శివరామిరెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 21: తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి కోరారు. శనివారం ఆత్మకూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జంతువులు కొవ్వులతో తయారైన నెయ్యిని తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించినట్లు ఆరోపణలు చాలా బాధాకరమని అన్నారు. ఇది యావత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది హిందువుల మనోభావాలను కించపర్చినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల లడ్డూ తయారీలో చోటుచేసుకున్న అపచారం, అవకతవకలపై లోతుగా విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని విజప్తి చేశారు. అదేవిధంగా తిరుమలలో ఆగమశాస్త్రాన్ని అనుసరించే స్వామివారికి కైంకర్యాలు జరపాలని ఆకాంక్షించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, సెప్టెంబరు 21: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో శనివారం చెన్నైకి చెందిన మైత్రీ సెంటర్ ఫర్ ఆర్ట్స్ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణపతిం, గురు నవనీతం, భ్రమరాంబాష్టకం, తాండవ నృత్యకరి, భో..శంభో, చక్కని మా శివయ్య తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.

సాగులో మెలకువలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పాములపాడు, సెప్టెంబరు 21: మండలంలోని మిట్టకందాల గ్రామంలో రైతులకు కందిపంట సాగులో మెళకవలు గురించి మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి హేమలత అవగాహన కల్పించారు. శనివారం ఆహార భద్రతా మిషన్ పథకం క్రింద పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. భద్రత మిషన్ ద్వార ఎంపిక చేసిన కంది పంటలో అంతర్ పంటగా రైతులు సాగు చేశారు. వారు మాట్లాడుతూ కాయ తొలుచు పురుగు నివారణకు వ్యవసాయశాఖ అధికారుల సలహాలతో వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మృతికి సంతాపం

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 21: కరివేన గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చిలుకూరి వెంకటేశ్వర్లు(65) గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై కోలుకోలేక శనివారం మృతి చెందారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరెడ్డి టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు స్వగృహం చేరుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ ఆత్మకూరు మండల అధ్యక్షుడు శివప్రసాదరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్ వెంకటేశ్వర్లు మృతదేహానికి పూలమాలలు సమర్పించి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు దినకర్, కొండలరావు, రవినాయక్, శశశంకరశర్మ, శరత్, ఓబులేసు, ఈశ్వరయ్య, నారాయణ, కాగుల శేషన్న ఉన్నారు.

గడివేముల: కొరటమద్ది గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బత్తుల సుంకన్న (38)శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి టీడీపీ నాయకులు కృష్ణామాచారి పూలమాల వేసి నివాళులర్పించారు. సుంకన్న కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

'వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

నందికొట్కూరు, సెప్టెంబరు 21: గత ప్రభుత్వంలో నియమించిన వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి, ఏపీ వలంటీరు అసోసియేషన్ తాలుకా కమిటీ కన్వీనర్ రమేష్, సీపీఐ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. నందికొట్కూరు పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలంటీర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వలంటీర్ల హక్కుల సాధనకై, భవిష్యత్ కార్యాచరణలపై, రాష్ట్ర వ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు గాంధేయ మార్గంలో శాంతియుతంగా వినూత్న రీతిలో ఆందోళన కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

ముగిసిన క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

గడివేముల, సెప్టెంబరు 21: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. అండర్-14, 17 బాలికల విభాగంలో క్రీడా పోటీలను హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విక్టర్ ఇమ్మానుయేలు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ విభాగంలో సుమారు 230 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు భుజంగరావు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పేరు తీసుకురావాలి: మంత్రి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 21: నీట్, జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన వైద్య ఇంజనీరింగ్ విద్యార్థులు జాతీయ స్థాయిలో నంద్యాలకు పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఇటీవలే విడుదలైన మెడికల్ ఫలితాల్లో నంద్యాల పట్టణ శివారులోని ఎస్డీఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజి విద్యార్థులు అత్యధికంగా మెడికల్ సీట్లు సాధించడంతో విద్యార్థులకు శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్వీఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఎస్డీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ ఆర్జీఎం ఐఎస్ జట్టు



ఆర్జీఎం ఐఎస్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మిద్దె శాంతిరామ్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 21: ఆర్జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీఎం, శాంతిరామ్ విద్యాసంస్థల ఫ్యాకల్టీ స్పోర్ట్స్‌మీట్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఆర్జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు కైవసం చేసుకుంది. రెండు రోజుల నుంచి జరిగిన క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. మెన్స్ విభాగంలో వాలీబాల్ విజేతగా శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు, రన్నర్స్‌గా ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల జట్టు నిలిచాయి. క్రికెట్‌లో శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజి జట్టు విజేతగా నిలిచింది. కబడ్డీలో ది నంద్యాల పబ్లిక్ స్కూల్ జట్టు విజేతగా నిలవగా ఆర్జీఎం ఐఎస్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. టగ్ ఆఫ్ వార్‌లో ఆర్జీఎం కాలేజి విజేతగా, శాంతిరామ్ ఫార్మసీ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో త్రో బాల్‌లో ఆర్జీఎం ఐఎస్ విజేతగా నిలవగా నంద్యాల పబ్లిక్‌స్కూల్ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. డాడ్జిబాల్‌లో ఆర్జీఎం ఐఎస్ విజేతగా నిలవగా శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజి ద్వితీయ స్థానంలో నిలిచింది. టగ్ ఆఫ్ వార్ లో ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజి విజేతగా, నంద్యాల పబ్లిక్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. బాడ్మింటన్‌లో నంద్యాల పబ్లిక్ స్కూల్ విజేతగా, రన్నర్‌గా ఆర్జీఎం ఐఎస్ నిలిచింది. అథ్లెటిక్స్ విభాగాల్లో పురుషులు, మహిళలు ప్రతిభ కనబరచి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆర్జీఎం, శాంతిరామ్ విద్యాసంస్థల చైర్మన్ డా.మిద్దె శాంతిరాముడు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, మెమొంటోలను అందజేశారు. ఆర్జీఎం డీన్ అశోక్‌కుమార్, ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

జపాన్ కంపెనీల ప్రతినిధులతో ఆర్జీఎం కళాశాల డీన్ భేటీ



జపాన్ కంపెనీల ప్రతినిధులతో అశోక్‌కుమార్

పాణ్యం, సెప్టెంబరు 21: జపాన్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆ దేశ కంపెనీల ప్రతినిధులతో ఆర్జీఎం డైరెక్టర్ డాక్టర్ డీవీ అశోక్ కుమార్ భేటీ అయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ శనివారం మాట్లాడుతూ ఈనెల 20న బెంగళూరులో కర్ణాటక స్కిల్ డెవలప్ మెంట్ అకాడమీ జపాన్‌కు చెందిన పలు కంపెనీ సీఈవో, రిక్రూట్‌మెంట్ మేనేజర్లతో దక్షిణ రాష్ట్రాల సదస్సు నిర్వహించిందని చెప్పారు. జపాన్ కంపెనీలలో ఆర్జీఎం ఫైనల్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారని చెప్పారు. సదస్సులో జపాన్‌కు చెందిన మెర్క్యూరి, హోండా మోటార్స్, బిగ్ ఫోర్, ఫోర్త్ వ్యాలీ, కన్సర్ట్ వంటి ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు. అలాగే జపనీస్ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎకనమిక్స్ అండ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు. కర్ణాటక స్కిల్ డెవలప్ మెంట్ అకాడమీ చైర్మన్ డాక్టర్ ఈవీ రమణారెడ్డి, వివిధ రాష్ట్రాల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ఈ భేటీపై ఆర్జీఎం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ఎండీ శివరాం హర్షం వ్యక్తం చేశారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు 120 మంది



క్రీడా పోటీలను పరిశీలిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

కొత్తపల్లి, సెప్టెంబరు 21: కొత్తపల్లి మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి నందికొట్కూరులో జరిగే నియోజకవర్గ స్థాయి క్రీడలకు 120 మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు మండల కోఆర్డినేటర్ మురళి నాయక్ తెలిపారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో భాగంగా అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో 40 మంది విద్యార్థులు, అండర్-14లో బాలబాలికలు, అండర్-17లో పాల్గొంటున్నారని తెలిపారు. అలాగే కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, బాడ్మింటన్, యోగా స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో నియోజకవర్గ స్థాయిలో మండలం నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొంటున్నారనీ వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుంకన్న, స్వప్న, రీనాబేగం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నంద్యాలలో దేవి భాగవత ప్రవచనాలు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 21: 18 నంద్యాల రమాసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శనివారం సాయంకాలం దేవి భాగవత ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. పురాణాల్లో అత్యంత శ్రేష్ఠమైనది దేవీ భాగవత పురాణమని టీటీడీ, శ్రీశైల దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యాఖ్యాత ప్రసంగిస్తూ శక్తి స్వరూపిణి జగజ్జననీ లోకాలనుకాపాడే చల్లని తల్లి భక్తులపాలిట కల్పవల్లి గా అమ్మవారిని వర్ణించే విశేషంగా చెప్పే గ్రంథమే దేవీ భాగవతం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత'

ఆత్మకూరు, సెప్టెంబరు 21: ఆత్మకూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్వచ్ఛతా హి సేవా -2024 కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలో మున్సిపల్ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఏఈ ఓబులేసు, టీఎంసీ వెంకటేశ్వర్లు, సీఈవో హుసేన్‌బీ తదితరులు ఉన్నారు.

పాణ్యం: మండలంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇందిరానగర్‌లోని గిరిజన గురుకుల పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి మంజుల వాణి ఆధ్వర్యంలో మానవహారాలు ఏర్పాటు చేసి స్వచ్ఛత, పరిశుభ్రత గురించి తెలిపారు. సర్పంచ్ పల్లవి, ఉపసర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో దస్తగిరి, ఈవోఆర్డీ సులోచన, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఏపీవో విజయరాణి, మాజీ జడ్పీటీసీ నారాయణమ్మ, జిల్లా టీడీపీ కార్యదర్శి రమణమూర్తి, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు ఖాదర్‌బాషా, హెచ్ఎంలు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి: డీఏవో

గోస్పాడు, సెప్టెంబరు 21: ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. శనివారం జిల్లెల్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్న రైతు బాలమద్దిలేటి పొలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయంలో దిగుబడి తక్కువగా ఉన్న పెట్టుబడి కూడా తక్కువగా ఉంటుందని, రైతులు ఆదిశగా అడుగులు వేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సురేంద్రారెడ్డి, అడిషనల్ డీపీఎం సలాం, ఏవో స్వప్నిక, రవీంద్రాచారి, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్ కార్మికులకు పీఎఫ్ చెల్లించాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 21: పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల పీఎఫ్ బిల్లులను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, నాయకులు రామ్‌నాయక్, రణధీర్, రజాక్ డిమాండ్ చేశారు. శనివారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ డబ్బును కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అలాగే మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్స్‌లు ఇవ్వాలని, కొత్తగా చేరిన కార్మికులకు ఆప్కాస్ ద్వారా జీతాలు, హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు నాగన్న, గొడుగు రాజు, తిమ్మయ్య నాగరాజు, నాగన్న, సురేష్, రవి, రఫీక్, సుధాకర్, రాజేష్, సువర్ణమ్మ తదితరులు ఉన్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 21: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, స్కావెంజర్స్‌కు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకురాలు రమిజాబి, శంషాద్, స్కావెంజర్స్ సంఘం నాయకులు బేగం, ప్రభావతి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం నందు ఎంఈవోలు బాలాజీనాయక్, సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం, స్కావెంజర్స్‌పై రాజకీయ వేధింపులు ఆపాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రమిజాబీ, తిరుపతమ్మ, వెంకటసుబ్బమ్మ, మేరమ్మ తదితరులు ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వీరాంజనేయ స్వామికి విశేష పూజలు



చాగలమర్రిలో వీరాంజనేయస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, సెప్టెంబరు 21: చాగలమర్రి గ్రామంలోని గాంధీ బజార్‌లోగల వీరాంజనేయస్వామికి శనివారం వేద పండితుడు ప్రతాప్ శర్మ ఆధ్వర్యంలో మహిళలు విశేష పూజలు చేశారు. సామూహికంగా అంజనేయస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భాద్రపదమాసం సందర్భంగా మహిళలు భజన కార్యక్రమాలు నిర్వహించారు. కోదండరామ, పట్టాభిరామ, వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవ మూర్తుల పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నర్స య్య, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఉర్దూ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ గని

శిరివెళ్ల, సెప్టెంబరు 21: ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉర్దూ మీడియం పెడగాజి రాష్ట్ర పరిశీలకుడు షేక్ అబ్దుల్ గని ఉపాధ్యాయులకు సూచించారు. శిరివెళ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాల, యర్రగుంట్ల ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర(స్టూడెంట్ కిట్) పంపిణీ, నాణ్యతను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సూచ నలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉర్దూ అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి యూనస్ బాషా, ఎంఈవో-2 నాగార్జునరెడ్డి, ఆ యా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బేతంచెర్ల, సెప్టెంబరు 21: యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం తులు అవుతారని హెచ్ఎం నారాయణ గుప్తా తెలిపారు. శనివారం మండలంలోని కొలుములపల్లె గ్రామంలో మండలస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా యోగా పోటీలను హెచ్ఎం ప్రారంభించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు డోన్ నియోజకవర్గంలో నిర్వహించే స్కూల్ గేమ్స్ పెడరేషన్ కార్యక్రమానికి మండల స్థాయి యోగా పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు ఐదుగురు, శిశుమందిర్ పాఠశాల నుంచి ముగ్గురు, ముద్దవరం పాఠశాల నుంచి ముగ్గురు, కొలుములపల్లి నుంచి ముగ్గురు, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారని మండల కోఆర్డినేటర్ వెంకట నాయక్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీరాములు



ఎల్ఐసీ శ్రీరాములును సన్మానిస్తున్న ఏజెంట్లు, టీడీపీ నాయకులు

డోన్, సెప్టెంబరు 21: డోన్ ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా గోసానిపల్లికి చెందిన ఎల్ఐసీ శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయ రాయల్ ఫంక్షన్ హాలులో ఎల్ఐసీ ఏజెంట్ల జనరల్ బాడీ ఎన్నికలు నిర్వహించారు. ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ కార్యదర్శిగా మాకం ప్రసాద్, కోశాధికారిగా చెన్నయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ నూతన అధ్యక్షుడు ఎల్ఐసీ శ్రీరాములును అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్లు నాగిరెడ్డి, నాగేంద్ర ప్రసాద్, రమణారెడ్డి, వీరస్వామి, ప్రసాద్, రామలింగారెడ్డి, శివరంగారెడ్డి, జయరంగారెడ్డి, నాగ భూషణం, వెంకటేశ్, వెంకట్రాముడు తదితరులు శ్రీరాములును సన్మానించారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.1.48 లక్షలు

బేతంచెర్ల, సెప్టెంబరు21: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.1.48 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.1,48,220ల ఆదాయం దేవస్థానానికి వచ్చినట్లు ఆయన తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

చాగలమర్రి, సెప్టెంబరు 21: మండలంలో ఇద్దరు వ్యక్తుల నుంచి 104 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పెద్దబోదనం గ్రామానికి చెందిన నాగేశ్వర రావు చాగలమర్రిలోని వివిధ మద్యం దుకాణాల్లో 54 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామని అన్నారు. అలాగే ముత్యాలపాడు గ్రామానికి చెందిన ఇమామ్‌లు అనే వ్యక్తి 50 మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా ముత్యాలపాడు బస్టాండు సమీపంలో స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

సంజామల, సెప్టెంబరు 21: పౌష్టికాహారం తీసుకోవటం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలు పురస్కరించుకొని గిద్దలూరు, సంజామల 4వ అంగన్ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శాంత, సుగుణ, వైద్య ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పసుపుల గ్రామం ఎంపిక

బనగానపల్లె, సెప్టెంబరు 21: బనగానపల్లె మండలంలోని పసుపుల గ్రామాన్ని జాతీయ పథకంలో భాగంగా పోషక, ఆహార భద్రత కార్యక్రమంలో భాగంగా రైతులను ఎంపిక చేసినట్లు వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. వంద ఎకరాల్లో కందిపంట వేసే రైతులకు సబ్సిడీపై ఎరువులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ట్రైకోడెర్మివిరిడి 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాబోయే కాలంలో ఎంపిక చేసిన రైతులకు పురుగుల మందులు, తెగుళ్ల మందులు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయడం జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ రాజకుమారి
- అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి
- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి
- ఆవులదొడ్డిలో ప్రజా వేదిక సభ



డోన్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మొక్కను నాటుతున్న కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి

డోన్, సెప్టెంబరు 21: భూసమస్యల పరిష్కారానికి ఈనెల 22 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శనివారం మండలంలోని ఆవులదొడ్డి గ్రామంలో ప్రజా వేదిక సభను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి రైతులకు సాగునీరు అందించేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయిస్తుందన్నారు. రెవెన్యూ సదస్సులు భూసమస్యల పరిష్కారానికి దోహదపడుతాయన్నారు.

● స్వచ్ఛ డోన్‌గా మారుద్దాం:

స్వచ్ఛ డోన్ పట్టణంగా మార్చేందుకు ప్రజలు సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా స్వచ్ఛతా హి సేవా ర్యాలీని ఎమ్మెల్యే కోట్లతో పాటు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకుని క్లీన్ డోన్‌లో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మన చుట్టూ ఉండే రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డోన్ ఆర్డీవో వెంకట మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జయరాం, తహసీల్దార్ నాగమణి, టీడీపీ రాష్ట్రకార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, ఓంప్రకాష్, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్, జన సేన నాయకుడు ఆలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

భూ అక్రమాలపై విచారణ చేయాలి: బీజేపీ

డోన్: గత వైసీపీ ప్రభుత్వంలో డోన్ నియోజకవర్గంలో జరిగిన భూ అక్రమాలపై విచారణ చేయాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం డోన్ పట్టణంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్ రాజకుమారికి బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో డోన్ నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు దేవాదాయ, అసైన్డ్ భూములను కాజేశారని ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీశారు

శిరివెళ్ల, సెప్టెంబరు 21 : దేశంలోని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే తిరుమల వేంకటేశ్వరస్వామి పవిత్రతను గత వైసీపీ ప్రభుత్వం దెబ్బ తీసేలా వ్యవహరించిందని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య మండిపడ్డారు. తిరుమల లడ్డు ప్రసాదం తయారీలో అపవిత్ర పదార్థాలను వినియోగించినట్లు వెల్లడైన వ్యవహారంతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామంలోని గోవిందానంద ఆశ్రమంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై ఉన్నతస్థాయి అధికారులతో సమగ్రంగా విచారించి బాధ్యు లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమా వేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందుల రామకృష్ణ, వీహెచ్‌పీ శిరివెళ్ల ప్రఖండ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, మునీశ్వరరెడ్డి, బజరంగదళ్ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, చంద్ర, నాగమల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



గోవిందపల్లెలో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

తిరుమల శ్రీవారి లడ్డూను కల్తీ చేయడం దుర్మార్గం

డోన్ : తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో కల్తీ చేయడం చాలా దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ హిందువుల మనోభావాలను దెబ్బతీశాడని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో హిందువులు కానీ వారిని టీటీడీ చైర్మన్లుగా నియమించారని, అందువల్లనే లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేశారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ సీఎం జగన్ మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంలో బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయాలని సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



చాగలమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఎం నాగమ్మ తదితరులు

చాగలమర్రి, సెప్టెంబరు 21: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఏపీఎం నాగమ్మ తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలో ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ ఆధ్వర్యంలో ఏపీఎం నాగమ్మ, వెలుగు సీసీలు కలిసి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లే కార్డులతో పురవీధుల గుండా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరంలో మానవహారం...

రుద్రవరం : తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం రుద్రవరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పడి నినాదాలు చేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు ప్రజల ఆరోగ్యం భద్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ వెంకట్రాముడు, ఏపీయం కల్పలత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు భద్రత కిట్లు పంపిణీ

అవుకు : అవుకు పంచాయతీ కార్యాలయంలోని పారిశుధ్య కార్మికులకు భద్రత కిట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మంద గుర్ర మ్మ, ఉప సర్పంచ్ చల్లా రఘునాథరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, ఈవో అశ్వినీకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ధైర్యాన్నిచ్చిన 'వంద రోజుల పాలన'



కొలిమిగుండ్ల మండలం కమ్మవారిపల్లెలో ఇంటింటికీ తిరుగుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి



తొడెండ్లపల్లెలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 21 : టీడీపీ కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన రాష్ట్రంలో ప్రజలకు ధైర్యాన్నిచ్చిందని టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కమ్మవారిపల్లె, బందార్లపల్లె, అబ్దులాపురం, కోరుమానుపల్లె, కోటపాడు గ్రామాల్లో మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మూలే రామేశ్వరరెడ్డితో పాటు కమ్మవారిపల్లె మొలక రాందాస్, వెంకటేశ్వరరావు, కోటపాడు మూల శివారెడ్డి, శివరామిరెడ్డి, సీతారామిరెడ్డి, కోరుమానుపల్లె నరసింహారెడ్డి, ఓబయ్య తదితర టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి 100రోజుల పాలనలో జరిగిన మంచిని వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు బందార్లపల్లె కళ్యాణ్‌రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని తొడెండ్లపల్లె గ్రామంలో టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఇది ప్రజా ప్రభుత్వం కరపత్రాలతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉసేన్‌రెడ్డి, సంజీవరాయుడు, ఉసేని, సచివాలయ ఉద్యోగులు ప్రదీప్, రజియా, జ్యోతి, స్రవంతి పాల్గొన్నారు. అలాగే చాగలమర్రి గ్రామంలో సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు కలిసి ఇది ప్రజా ప్రభుత్వం స్టిక్కర్లతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జెట్టి నాగరాజు, మౌళాలి, అనిఫ్, గఫార్, బషీర్, కరిముల్లా, అజీమ్, భాస్కర్‌రెడ్డి, అబ్దుల్‌ఖాదర్, ఓబులేసు, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోయలకుంట్ల, గోవిందపల్లె గ్రామాల్లో ఇంటింటికి పర్యటించి కూటమి ప్రభుత్వ పాలన గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు గంగదాసరి శ్రీనివాసరెడ్డి, రవిచంద్రారెడ్డి, లక్ష్మీరెడ్డి, సంగిరెడ్డి నాగేశ్వరరెడ్డి, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



అర్జునాపురంలో కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఏఈ సుప్రియ

బనగానపల్లె : బనగానపల్లె మండలం పాతపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు షేక్షావలి, సెక్రటరీ శకుంత, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు : మండలంలోని కాశీపురం, శివవరం, చెన్నంపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో కాశీపురం గ్రామ టీడీపీ నాయకుడు మొట్ల రామిరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ఈవోఆర్డీ రామక్రిష్ణవేణి, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, వెలుగు ఏపీఎం విజయగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

సంజామల : అభివృద్ధి సంక్షేమం సీఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు కానాల కేశవరెడ్డి అన్నారు. శనివారం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను కానాలలో కేశవరెడ్డి, గిద్దలూరులో మండల టీడీపీ ఇన్‌చార్జి బత్తుల వెంకటప్రతాప్‌రెడ్డి, ముక్కమళ్లలో మూసాని చంద్రశేఖర్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో శేషారెడ్డి, మోహన్‌రెడ్డి, పులిభాస్కర్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, బండి జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు ఆయా గ్రామాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం, అమ్మిరెడ్డినగర్ గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అందించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అర్జునాపురం సర్పంచ్ భూమా ప్రభాకర్‌రెడ్డి, పుల్లయ్య, ఉసేని, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ఆళ్లగడ్డలో భారీ వర్షం



మొక్కజొన్న ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పుతున్న రైతు

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), సెప్టెంబరు 21: ఆళ్లగడ్డ ప్రాంతంలో శనివారం భారీ వర్షం కురి సింది. రోడ్లపై ఆరబోసుకున్న మొక్కజొన్న పంట దిగుబ డులు పూర్తిగా తడిసిపోయా యి. పంట దిగుబడులు త డవకుండా వాటిపై టార్పాలి న్ కవర్లు కప్పుకోవడానికి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు.

రుద్రవరం : రుద్రవరం మండలంలో మొక్కజొన్న రైతుల గుండెల్లో రైళ్లు పరి గెడుతున్నాయి. శనివారం తుఫాను ప్రభావంతో చినుకులు రాలడంతో మొక్కజొన్న రైతులు హడలెత్తిపోయారు. రహదారులపై మొక్కజొన్న ధాన్యం ఆరబోశారు. తుఫానుతో చినుకులు రాలడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

కోవెలకుంట్ల, సెప్టెంబరు 21: ఈ నెల 24 నుంచి కోవెలకుంట్ల మండలంలో వివిధ గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ శనివారం తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం, సాయంత్రం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలు వచ్చేనెల 30వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు సన్మానం

రుద్రవరం, సెప్టెంబరు 21 : ఆదర్శ పాఠశాల పూర్వ విద్యార్థులు ఐదుగురు ఎంబీబీఎస్ సీట్లు సాధించి ఆదర్శంగా నిలిచారని ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం ఆదర్శపాఠశాల ఆవరణంలో ఐదుగురు పూర్వ విద్యార్థులకు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రుద్రవరానికి చెందిన బిందు, ఛాయాదేవి, లోకేశ్, పూజిత, శరత్ పూర్వవిద్యార్థులు ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాసాపురంలో వేంకటేశ్వరుడికి పూజలు

రుద్రవరం, సెప్టెంబరు 21: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి లక్ష్మిగోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి, త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు శనివారం అర్చకులు గోపిశర్మ, శివశర్మలు అభి షేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చాగలమర్రి, సెప్టెంబరు 21: చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య సంరక్షణ(పీపీ)కిట్లను ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం పారిశుధ్య కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు

చాగలమర్రి, సెప్టెంబరు 21: మండలంలోని 16 వేల గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాదు తెలిపారు. శనివారం చాగలమర్రి పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ 19 గ్రామ పంచాయతీల్లో పశువైద్య సిబ్బంది గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారని అన్నారు. గొర్రెలు, మేకల యజమానులు టీకాలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు. ఉయ్యాలవాడ, చాగలమర్రి మండలాల్లో 35 మెట్రిక్ టన్నుల దాణ కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పశుగ్రాసం కత్తిరించేందుకు యంత్రాలు కూడా మంజూరయ్యాయని అన్నారు. పాడి రైతులు అప్రమత్తంగా ఉండా లని అన్నారు. పశువైద్యాధికారులు సాయిబాబా, దీపకుమారి, కోటయ్య ఉన్నారు.

టీజీపీ నీటి ప్రవాహం పరిశీలన

చాగలమర్రి, సెప్టెంబరు 21: ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని టీజీపీ ప్రధాన కాలువలో 2,600 క్యూసెక్కులతో నీరు ప్రవహిస్తోందని జిల్లా టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. శనివారం మండలంలోని చిన్నవంగలి గ్రామ సమీపంలో కడప జిల్లా సరిహద్దు వద్ద టీజీపీ నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30 నుంచి 37వ బ్లాక్ వరకు డిస్ట్రిబ్యూటర్ల ద్వారా పంట కాలువలకు నీరు విడుదల చేశామని, ఆయకట్టు రైతులు నీరు వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు. చాగలమర్రి మండలంలో 36,329 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. అనుమతి లేకుండా గేట్లను ఎత్తితే చర్యలు తప్పవని హె చ్చరించారు. ఆయన వెంట ఏఈలు సలీమ్, నియాజ్‌అహ్మద్, వర్క్‌ఇన్‌స్పెక్ట ర్లు ఉన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు : ఏడీఏ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 21 : నియోజకవర్గంలోని మండలాల్లో ఎరువుల దుకాణాల డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. నియోజకవర్గంలోని అన్ని ఆర్బీకేలకు యూరియా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆళ్లగడ్డ మండల పరిధిలోని ఆర్బీకేలలో 25 టన్నుల యూరియా, చాగలమర్రి ఆర్బీకేలలో 48 టన్నుల యూరియా ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు. రుద్రవరం, గోస్పాడు, శిరివెళ్ల మండలాల్లోని ఆర్బీకేలకు వచ్చిన యూరియాను రైతులు పూర్తిగా కొనుగోలు చేశారన్నారు. నియోజకవర్గంలో 80శాతం పంట నమోదు ప్రక్రియ పూర్తైనట్లు ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి వెల్లడిం చారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్యాపిలి, సెప్టెంబరు 21: మండలంలోని ఏనుగమర్రి హైస్కూల్ ఉపాధ్యాయురాలు ఎస్. సోనిని ఎస్టీయూ నాయకులు సన్మానించారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశం ఆ సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందు కున్న సోనిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యాయులు చిన్నపురెడ్డి, కిరణ్‌కుమార్, హాజీ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

24న పలుకూరులో క్రీడా పోటీలు

బనగానపల్లె, సెప్టెంబరు 21: బనగానపల్లె మండలం పలుకూరు గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 24న మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో స్వరూప శనివారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలను వ్యాయామ ఉపాధ్యాయులు మండల కో ఆర్డినేటర్‌కు సమర్పించాలని ఆమె కోరారు.

ఎస్వీఆర్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 21 : ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎల క్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా పని చేస్తున్న కశెట్టి లక్ష్మీ నరసింహ తమిళనాడు అన్నా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినట్లు కళాశాల చైర్మన్ వెంకటరామిరెడ్డి తెలిపారు. డాక్టరేట్ పొందిన లక్ష్మీ నరసింహను ఎండీ దినేష్‌రెడ్డి, చైర్మన్ వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి అభినందించారు.

'ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

బేతంచెర్ల, సెప్టెంబరు 21: పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీకి సంబంధించి ఫ్యాక్టరీ యాజమాన్యం కోటాలో పని చేస్తున్న కొందరు వ్యక్తులు వైసీపీ కార్యాలయంలో కూర్చుని వేజ్‌బోర్డు ఎంప్లాయిస్‌పై అనుచితంగా మాట్లాడటం సరికాదని కార్మిక సంఘం నాయకుడు మోజెస్ అన్నారు. శనివారం బేతంచెర్ల స్థానిక జీఎస్సార్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. తమ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని, మీరు ఎక్కడ చర్చకు సిద్ధమంటే అక్కడికి వస్తామన్నారు. సమావేశంలో రామసుబ్బయ్య, రామాంజనేయులు, శేఖర్, శ్రీనివాసులు నాయుడు, అనీఫ్, ఆకుమల్ల సుబ్బారెడ్డి, టీడీపీ గ్రామ నాయకులు రాముడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సుకు భారీ జరిమానా

డోన్(రూరల్), సెప్టెంబరు 21: ట్రావెల్ బస్సుకు ఆర్టీవో అధికారులు భారీ జరిమానా విధించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం డోన్ హైవే సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా.. నాగాలాండ్ రాష్ట్రం కోహినూరుకు చెందిన ట్రావెల్ బస్సు హైదరాబాదు నుంచి పులివెందులకు బయలుదేరింది. డోన్ హైవేలో ఆర్టీవో క్రాంతి కుమార్ తనిఖీ చేశారు. రాష్ట్రానికి సంబంధించిన రోడ్డు ట్యాక్స్‌లు కట్టకపోవడంతో రూ.4,56,500 జరిమానా విధించినట్లు ఆర్టీవో క్రాంతి కుమార్ తెలిపారు. అనంతరం ట్రావెల్ బస్సుకు డోన్ ఆర్టీసీ డిపోకు జప్తు చేసి తరలించినట్లు ఆయన తెలిపారు.